
గుండె గుడిలో అలజడి

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



● ముత్తుకూరు మండలానికి చెందిన 25 ఏళ్ల కిరణ్‌కు.. ఇంటి వద్ద ఉన్న సమయంలో ఒక్కసారిగా భరించలేని గుండె నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లే లోపే మృతి చెందారు.

● నెల్లూరు నగరానికి చెందిన 17 ఏళ్ల యువకుడికి గుండె భాగంలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించి.. చెన్నైకి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

అమ్మ కడుపులో ప్రాణం పోసుకున్న నాలుగో వారంలో కొట్టుకోవడంతో మొదలై.. నిర్విరామంగా శరీరంలో పనిచేసే అవయవం గుండె. అది క్షణం లయ తప్పినా.. జీవితం తలకిందులే. ఒకప్పుడు 60 ఏళ్లు.. ఆపై వయసులో కనిపించే హృద్రోగ సమస్యలు.. గుండెపోటుతో చనిపోతున్న సంఘటనలు.. ఇటీవల యుక్త వయసు వారిలోనూ పెరుగుతుండటం కలవరానికి గురి చేస్తోంది.

ఏటా 70వేల మంది...

జిల్లాలో ఏటా 70వేల మంది హృద్రోగ సమస్యల బాధితులు నమోదవుతున్నారు. కొవిడ్ అనంతర పరిస్థితుల్లో.. చిన్న వయసు వారికి స్టెంట్ వేయాల్సిన పరిస్థితులు ఎక్కువైనట్లు వైద్యులు చెబుతున్నారు. గుండెపోటుతో వస్తున్న యువతలో.. 90 శాతం మధుమేహం, పొగ, మద్యం తాగడం, ఒత్తిడితో బాధపడుతున్నవారేనని చెబుతున్నారు.

ప్రతి పది మందిలో... ఒకరికి

జిల్లాలో ప్రతి పది మందిలో ఒకరు హృద్రోగ సమస్యతో బాధపడుతుండటం కలవరపరుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 50 మంది వరకు కార్డియాలజిస్టులు ఉండగా- ఒక్కో నిపుణుడి వద్దకు రోజుకు సరాసరిన 20 నుంచి 25 మంది వరకు ఏదో ఒక గుండె సమస్యతో వస్తున్నారు. కొవిడ్ తర్వాత.. ఆసుపత్రులకు వచ్చే బాధితుల్లో సగానికి పైగా యువతే ఉంటున్నారు. మహిళల్లోనూ ఈ సమస్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు.

గుండె జబ్బులు ఉన్న వారి వివరాలు

వయసు..	శాతం
20-40 :	40
40-50 :	25
50-65 :	35



క్రమం తప్పక పరీక్షలు.. అవసరం

– సీహెచ్ భక్తవత్సలరెడ్డి, కార్డియాలజిస్ట్

40 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. కొందరు ఫోన్ చూస్తూ గంటల తరబడి ఒకేచోట కూర్చుంటారు. అలాంటి వారు అటు ఇటు తిరగడం, దగ్గరి దూరాలకు వాహనాలు వినియోగించకుండా.. నడవడం అలవాటు చేసుకోవాలి. ఇటీవల గుండెపోటుకు గురవుతున్న యువతలో.. ఎక్కువ మంది పొగాకు ఉత్పత్తులు వినియోగించేవారే ఉంటున్నారు.



వ్యసనాలకు దూరంగా ఉండాలి

– సీఎస్ శ్రీనివాసరాజు, గుండె వ్యాధి నిపుణులు

గుండె సంబంధిత వ్యాధులు వస్తున్న వారిలో ఎక్కువగా యువతే ఉంటున్నారు. మానసిక ఒత్తిడి, వ్యాయామం, సరైన ఆహార అలవాట్లు లేకపోవడం, ధూమ, మద్యపానం పరిస్థితికి కారణమవుతోంది. మంచి ఆహారం, వ్యాయామం తప్పనిసరి. రోజూ వ్యాయామ చేయలేని వారు.. వారాంతం చివరి రోజైనా దృష్టిసారించాలి.



ఆకాశమే హద్దుగా...

విద్యార్థినీ విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో అద్వితీయ ప్రదర్శన కనబరిచారు. తుది జట్టులో స్థానం కోసం.. ఏ చిన్న అవకాశాన్ని చేజార్చుకోకుండా భళా అనిపించారు.

– ఆట.. అవకాశాల బాట 6

ఎక్కడి వారికి.. అక్కడే సరకులు!

కార్డుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

‘మీ కార్డు మా పరిధిలో లేదు.. ఆ పక్క దుకాణం లెక్కలో ఉంది. ఇప్పటికే మాకు కేటాయించిన పరిమితి కంటే ఎక్కువ మందికి ఇచ్చాం’

– పట్టణాల్లో రేషన్ డీలర్ల నుంచి కార్డుదారులకు తరచూ వినిపించే మాట.

‘మా కార్డు 25వ వార్డులో ఉంది. మేము రెండో వార్డులో ఉంటున్నాం. అక్కడి వరకు వెళ్లి సరకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. దగ్గర్లోని దుకాణం వద్దకు వెళితే.. ఒక్కొక్కసారి ఇస్తున్నారు. ఒక్కోసారి ఇవ్వమబోమంటున్నారు.’

– కొందరు తెల్లకార్డుదారుల సమస్య



కందుకూరు: విప్పగుంటలో రేషన్ దుకాణం

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

కూటమి ప్రభుత్వం ఇలాంటి సమస్యలకు స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. అవసరమైన చోట రేషన్ దుకాణాలు పెంచాలని యోచిస్తోంది. ఎక్కడి వారికి అక్కడే నిత్యావసరాలు అందేలా చర్యలు ప్రారంభించింది. ఆ క్రమంలో ఏ వార్డులో ఉండే కార్డుదారులను.. అక్కడి చౌక దుకాణాల పరిధిలోకి తీసుకురానుంది. ఈ ప్రక్రియ మొత్తం అక్టోబరు, నవంబరు నెలల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 7,22,257 తెల్లకార్డులు

జిల్లాలో ఇప్పటి వరకు 7,22,257 తెల్లరేషన్ కార్డులు ఉండగా- గత ఏడాది నుంచి ఇప్పటి వరకు మరో పది వేల కొత్త కార్డులకు దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. వీరందరికీ ప్రతి నెలా సరకులు పంపిణీ చేసేందుకు 1513 చౌక దుకాణాలు ఉండగా- 2019లో వైకాపా ప్రభుత్వం.. ఎండీయూ వాహనాల వ్యవస్థను తీసుకొచ్చింది. జిల్లాలో ఆ వాహనాలు 438 ఉన్నాయి. ఆ క్రమంలో కార్డుదారులకు కొత్త చిక్కులు వచ్చాయి. ఒక వార్డులోని కార్డుదారులకు.. ఆ ప్రాంతంలోని డీలర్ నుంచి కాకుండా.. పక్క ప్రాంతం నుంచి ఎండీయూ వాహనం ద్వారా సరకులు పంపిణీ చేశారు. అంటే.. కార్డు ఒక చోట.. పంపిణీ మరోచోట జరిగింది. ఇప్పుడు ఇలాంటి సమస్యలు లేకుండా కూటమి ప్రభుత్వం చౌక దుకాణాల పునర్విభజనకు శ్రీకారం చుట్టింది. అక్టోబరు 8వ తేదీలోపు కొత్త దుకాణాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు. నవంబరు నెలాఖరులోపు డీలర్ల ఎంపికనూ పూర్తి చేయనున్నారు. మొత్తం మీద జిల్లాలో 100కు పైగా కొత్త దుకాణాలు ఏర్పాటు చేయనుండగా- ఆశావహులు డీలరు పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఒకటీ, రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి

– వెంకటరమణ, పౌరసరఫరాలశాఖ డీఎస్వో

కార్డుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఉండే చౌక దుకాణాల సంఖ్యనూ పెంచనున్నాం. ప్రభుత్వ సూచనల మేరకు పునర్విభజన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పట్టణాల్లో సరాసరిన 500- 550 కార్డులు ఉండేలా దుకాణాల పునర్విభజన జరుగుతుంది. ఒకటి, రెండు నెలల్లో ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది.

మేమున్నామని.. మీకేం కాదని!

నిరుపేదల విద్య, వైద్యానికి సాయం





చేతిలో చిల్లిగవ్వ లేదు.. ఆసుపత్రిలో బిల్లు చూస్తే రూ. లక్షల్లో ఉంది. బంధువులనో, స్నేహితులనో అడుగుదామంటే అభిమానం అడ్డొస్తోంది. అడిగినా.. ఇవ్వగలరన్న గ్యారంటీ లేదు. ఈ రోజుల్లో ఎవరి పరిస్థితి మాత్రం బాగుంది కనుక..! ఈ తరహా సంఘటనలే కొందరు యువతీ యువకులను కదిలించాయి. అలాంటి వారి కోసం తమ జీతంలోని కొంత భాగాన్ని కేటాయించడంతోపాటు స్నేహితుల సాయం తీసుకుని.. వారికి అండగా నిలవడంలోనే ఆనందం వెతుక్కుంటున్నారు. కన్నీళ్లే జీవితంగా గడుపుతున్న వారి వెన్ను తట్టి.. వారి మోముల్లో నవ్వులు విరబూయిస్తూ భళా అనిపించుకుంటున్నారు.

నెల్లూరు, ఈనాడు

అనారోగ్యంతో ఉన్నవారికి..

కావలి పట్టణానికి చెందిన నల్లిపోగు ప్రణీత్ తన స్నేహితులతో కలిసి.. 2018లో ‘టీఎం సేవియర్స్’ సంస్థను ప్రారంభించారు. తొలుత ఈ సంస్థ ద్వారా రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించి.. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వైద్య ఖర్చులకు సాయం చేస్తున్నారు. గడిచిన ఏడేళ్లలో సుమారు 120 మందికి రూ. 50 లక్షల వరకు సాయం అందించారు. 2020లో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు రూ. 4.10 లక్షలు ఇవ్వగా.. అదే రోజు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తికి కందుకూరు ఆసుపత్రిలో రూ. 70వేల బిల్లు కట్టారు. ఇలా అవసరమని తమను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి తోడుగా నిలుస్తున్నారు. తాజాగా ఈ నెల 18వ తేదీ అనారోగ్యంతో బాధపడుతున్న హైదరాబాద్‌కు చెందిన ఏడాది బాబుకు రూ. 21 వేలు అందించారు.

ఆదుకోవడంలోనే.. ఆనందం

నెల్లూరు నగరానికి చెందిన కోగిలి రమేష్ రాజు.. విద్యుత్తుశాఖలో కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన ఈయన.. తన స్నేహితులతో కలిసి.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని నిర్ణయించారు. 2020లో ‘పవర్ యూత్ సేవా సొసైటీ’ పేరుతో సంస్థను ప్రారంభించారు. స్నేహితులంతా ఒకరికి ఒకరు చేదోడుగా నిలుస్తూ.. సాయం కోరిన వారికి అండగా నిలుస్తున్నారు. ఏటా రూ. 5 లక్షల వరకు సేకరించి.. పేదల అవసరాలకు అందిస్తున్నారు. ప్రమాద బాధితులకు.. అవసరమైన రక్తదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, కుట్టుమిషన్లు ఇవ్వడం, ఫంక్షన్లలో మిగిలిన ఆహారం సేకరించి.. పేదలకు అందించడం తదితరాలు చేస్తున్నారు.

సొంతూరికి.. కొంత..



అమ్మ స్వగ్రామం మనుబోలుకు తనవంతు తోడ్పాటు అందించాలని నిర్ణయించుకున్న మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి.. మండలంలో సాయం కోసం ఎదురు చూస్తున్నవారికి చేయూతనందిస్తున్నారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నా.. గ్రామంలోని స్నేహితులతో కలిసి అయిదేళ్ల కిందట సేవానాదం ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 20 మందికి రూ. 15 లక్షల వరకు సాయం అందించారు. ఇంటి పెద్దను కోల్పోయి.. నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు పిల్లల చదువు బాధ్యత తీసుకున్నారు. కాలేయ వ్యాధితో చనిపోయిన గిరిజన కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సాయం చేశారు. ఇటీవల మనుబోలుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తలకు దెబ్బతగిలి ఆసుపత్రిలో ఉంటే.. రూ. 20 వేలు అందించి సహృదయత చాటుకున్నారు.

ఈవీఎం గోదాముల వద్ద నిఘా

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: ఈవీఎం గోదాముల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలోని ఈవీఎంల గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. తహసీల్దారు షఫిమాలిక్, డీటీ అశోక్‌వర్ధన్, తెదేపా, వైకాపా, బీఎస్పీ ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, రాజేష్, మురళీధర్‌రెడ్డి, శ్రీరామ్, పుష్పాంజలి తదితరులు ఉన్నారు.


లక్ష్మీ నరసింహునికి గరుడసేవ



గరుడ వాహనసేవలో భక్తులు

పెరటాసి మాసం తిరుమల శనివారాన్ని పురస్కరించుకుని నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలిసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గరుడసేవ, గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. భక్తులు గరుడ వాహనంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు భాస్కరాచార్యులు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

ఉరుసు శోభ



ఏఎస్‌పేటలోని హజరత్‌ఖాజానాయబ్ రసూల్ 251, కసుమూరు మస్తాన్‌వలి దర్గా 247వ గంధ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాలకు భక్తులు తరలివస్తుండగా- నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రెండు దర్గాలను విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరగనుండగా- భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

– న్యూస్‌టుడే, ఏఎస్‌పేట, కసుమూరు(వెంకటాచలం)



నడికుడి.. నడవాలి మరి!



పరిహారం విషయంలో తాజాగా కదలిక

వింజమూరు, న్యూస్‌టుడే

అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ వ్యవహారం. దశాబ్దాలు గడుస్తున్నా కల సాకారమేమోగానీ.. అంచనా వ్యయం భారీగా పెరుగుతోంది. గతంలో తెదేపా పాలనలో కాస్త పురోగతి కనిపించినా.. వైకాపా వచ్చాక.. ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. తాజాగా పరిహారం విషయంలో కదలిక రావడంతో.. ఈ సారైనా పూర్తికావాలన్న ఆశ.. ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

సాగుతున్న భూసేకరణ

భూసేకరణ పనులు ఇటీవల పూర్తవగా- భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గతంలో రైల్వేలైన్ కోసం 55 నుంచి 65 మీటర్ల వెడల్పుతో, స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన చోట 130 మీటర్ల వెడల్పుతో స్థలాలను గుర్తించి.. నివేదిక తయారు చేశారు. డిక్లరేషన్ ఇచ్చి.. అవార్డు విచారణ కూడా పూర్తి చేశారు. అయిదేళ్లు దాటినా సెటిల్‌మెంట్ భూములు కోల్పోయిన వారికి.. ఇప్పటికీ పరిహారం అందలేదు. మరికొందరు తక్కువ అని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక అసైన్డ్‌మెంట్ భూములు కోల్పోయిన వారికి తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జాబితాలు తయారు చేశారు.



రైల్వే స్టేషన్ కోసం వింజమూరులో గుర్తించిన ప్రదేశం

ఇదీ రైల్వే లైన్ స్వరూపం

బడ్జెట్‌లో కేటాయింపులు (రూ. కోట్లలో)	
2013–14	3
2014–15	10
2015–16	110
2017–18	220
2018–19	750
2019–20	700
2020–21	188
2023–24	248
2024–25	450

మంజూరు : 2011-12 | అంచనా వ్యయం: రూ. 2289 కోట్లు | ప్రాజెక్టు నిడివి: 309 కి.మీ | స్టేషన్లు : 38

ప్రయోజనాలేమంటే..

తిరుపతి- హైదరాబాద్ మధ్య 80 కి.మీ. దూరం తగ్గుతుంది. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ, పండ్ల తోటల ఉత్పత్తులు, గ్రానైట్ ఎగుమతులకు అవకాశం ఏర్పడి.. వాణిజ్యపరంగా అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుత రైల్వేలైన్‌కు... చక్కటి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనుంది.

పరిహారం అందించేందుకు చర్యలు

– ఎస్‌ఎం హమీద్, తహసీల్దారు, వింజమూరు


రైల్వేలైన్‌లో భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం ఇచ్చే విషయమై తాజాగా విచారణ జరిపి.. జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. సెటిల్‌మెంట్ భూములు 161 మందివి 62.31 ఎకరాలుగా తేల్చాం. అసైన్‌మెంట్ 139 మంది రైతులకు సంబంధించి.. 147 ఎకరాలు ఉంది. ప్రభుత్వ భూమి కూడా ఉంది. భూ యజమానుల ఖాతాలకు నేరుగా పరిహారం నగదు వేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా భూముల్లో చెట్లు, బోర్లు, కట్టడాలు వంటి వాటి విలువను కూడా మదించాం. తుది జాబితా తయారు చేసి.. నివేదిక పంపాం.



ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి







సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

ఏఎస్సైలకు పోస్టింగులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొంది జిల్లాలో వీఆర్‌లో ఉన్న 17 మందికి పోస్టింగులు ఇస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్.భాస్కర్‌రెడ్డి ఏఎస్‌పేటకు, షేక్ రియాజ్ అహ్మద్ చిన్నబజారు, ఎ.వరప్రసాద్ సౌత్ ట్రాఫిక్, వై.శ్రీహరిబాబు నవాబుపేట(అటాచ్డ్ ఏహెచ్‌టీయూ), షేక్ జిలానీ మనుబోలు, వై.మాల్యాద్రి కావలి రెండో పట్టణం, బి.మునిరావు వేదాయపాలెం, పి.రాజగోపాల్ గుడ్లూరు, ఎం.వెంకటేశ్వర్లు ఇందుకూరుపేట, కె.లక్ష్మీనరసయ్య నవాబుపేట, కె.ఉమామహేశ్వరరావు సౌత్ ట్రాఫిక్, వి.మాధవరావు వేదాయపాలెం, షేక్ కరిముల్లా విడవలూరు, సీహెచ్ సురేంద్ర బాబు నెల్లూరుగ్రామీణం, సీహెచ్ శ్రీధర్‌రావు నవాబుపేట, ఎన్.మునికృష్ణ వెంకటాచలం, వి.శ్రీనివాసులును కోవూరు పీఎస్‌కు కేటాయించారు.

మార్చి 25 నాటికి పూర్తి కాని ఇళ్లు రద్దు: పీడీ

బిట్రగుంట, న్యూస్‌టుడే: మార్చి 25వతేదీలోపు ఇళ్ల నిర్మాణం పూర్తికాకుంటే రద్దవుతాయని గృహ నిర్మాణశాఖ పీడీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. శనివారం బోగోలు తహసీల్దారు కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన 89 వేల ఇళ్లలో.. ఇప్పటి వరకు 22 వేలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని మార్చి 25వతేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందన్నారు. ఆప్షన్-3 కింద ఏజెన్సీలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ నివేదికల ఆధారంగా లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. లేఅవుట్‌లో నీటి సౌకర్యం లేనందున.. ఇంటికి రూ.12వేల వరకు అదనపు వ్యయం అవుతోందని లబ్ధిదారులు తెలపగా.. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఆయన వెంట కావలి ఈఈ మాధవరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో గోవిందరావు తదితరులు ఉన్నారు.

ఆట.. అవకాశాల బాట

అదే ఉత్సాహంతో నెల్లూరు సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో రెండోరోజు అండర్ 14, అండర్ 17 బాలబాలికల జిల్లా క్రీడా పోటీలు, జట్ల ఎంపిక జరిగింది. జిల్లా విద్యాశాఖ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పాఠశాలల్లో ఎన్నో రోజులుగా శిక్షణ పొందిన విద్యార్థులు.. విజేతలుగా నిలిచేందుకు పోటీ పడ్డారు. పరుగు, ఖోఖో, షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి. –ఈనాడు, నెల్లూరు



100 మీటర్ల పరుగు



లాంగ్‌జంప్



షాట్‌పుట్ పోటీల్లో..



వృద్ధులను ఆటోలో ఎక్కిస్తున్న కానిస్టేబుల్ పెంచలయ్య

వయోభారమని చెప్పి.. పెంచిన తల్లిదండ్రులను వదిలేసి

అనంతసాగరం, న్యూస్‌టుడే: కడుపేదరికంతో జీవిస్తున్నా.. పిల్లలు లేరనే బాధ ఆ దంపతులను మనోవేదనకు గురిచేసింది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఓ పాపను దత్తత తీసుకున్నారు. అల్లారు ముద్దుగా పెంచి.. పెళ్లి చేశారు. ఆ క్రమంలోనే దంపతులకు వయోభారం దరి చేరింది. తనకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పరచిన వారిని చూసుకోవాల్సిన బాధ్యతను మరిచి ఆ కుమార్తె వదిలించుకున్న ఘటన సోమశిలలో శనివారం చోటుచేసుకుంది.


గూడూరు మండలం ఇందూరుకు చెందిన బండి రమణయ్య, లక్ష్మమ్మలకు పిల్లలు లేకపోవడంతో ఓ అమ్మాయిని దత్తత తీసుకుని పెంచి పెళ్లి చేశారు. రాపూరు మండలం గోనుపల్లిలో కూలీపనులు చేసుకుంటూ కుమార్తెతో అక్కడే ఉంటున్నారు. వృద్ధాప్యం కారణంగా దంపతులకు ఆరోగ్యం క్షీణించింది. లక్ష్మమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కూమార్తె, అల్లుడు.. లక్ష్మమ్మ బంధువుల ఇంటికి తీసుకెళుతామని చెప్పి సోమశిలలో ఆలయం వద్ద వదిలి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. కానిస్టేబుల్ పెంచలయ్య వృద్ధులను విచారించి సోమశిలలోని బంధువులకు సమాచారమిచ్చి ఆటోలో బంధువుల ఇంటికి చేర్చారు.



జగనన్నకాలనీల పేరుతో నాయకులకు, గుత్తేదారులకు దోచిపెట్టేందుకే తొలి విడతలో ఓగూరులో నిర్మాణాలు చేపట్టారా! అనే సందేహాలకు అవుననే సమాధానం వస్తుంది. ఇళ్లు నిర్మించకుండానే రూ.లక్షల ఖర్చుతో విద్యుత్తు, స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ గడ్డిపెరిగి, చిల్లచెట్లతో అడవిని తలిపిస్తోంది. అయినా, పంచాయతీ అధికారులు వీధిదీపాలు కూడా బిగించారు. కొన్నిచోట్ల ఇవి వెలుగుతుండగా.. మరికొన్నిచోట్ల మాడిపోయాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో విద్యుత్తుశాఖ అధికారులు ఈ వీధిదీపాలు వేయించారన్నారు.
– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

అండర్-19 క్రికెట్ జట్ల ఎంపిక

కందుకూరు పట్టణం: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-19 క్రికెట్ జట్ల ఎంపిక శనివారం పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగింది. సుమారు 70 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనగా. . ఉత్తమ ప్రతిభ చూపిన బాల, బాలికలను ఎంపిక చేసినట్లు డీఐఈవో శ్రీనివాసరావు, ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు.





నిమ్మకాయల ధరలు

పొదలకూరు (కిలో..)

పెద్దవి	రూ. 55
చిన్నవి	రూ. 74

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ.7,308
సవర ధర:	రూ.58,464
వెండి గ్రాము :	రూ.96.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

లక్ష్యాల పూర్తికి చర్యలు తీసుకోండి: కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సూక్ష్మ నీటి పారుదల పథకం కింద ఉద్యానవన పంటలకు మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ ఏడాదికి 10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మనుబోలు : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన వీరంపల్లి అడ్డరోడ్డు సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... సుమారు 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై రాకేశ్ సంఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుండెపోటుతో మృతిచెందాడా..? ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి కేసునమోదు చేశారు.

కావలి
• కావలి • ఉదయగిరి • కందుకూరు

రూ. 1.42 కోట్లతో భవన నిర్మాణాలు: డీఈఈ

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలో రూ. 1.42 కోట్లతో ఏడీఈ, ఏఈ, ఈఆర్‌వో కార్యాలయాల నూతన భవనాలు నిర్మించనున్నట్లు ట్రాన్స్‌కో ఆత్మకూరు డీఈఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సబ్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. 167-బి జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించిన ఏడీఈ కార్యాలయం, ప్రహరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించిన వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఏడీఈ, ఏఈ, ఈఆర్‌వో కార్యాలయాలు ఒకేచోట ఉండేలా నిర్మాణాలు చేయటం జరుగుతుందన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో లోవోల్టేజీ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

'వసతుల్లేకుండా ఇళ్ల నిర్మాణాలు ఎలా?'

ఉదయగిరి, న్యూస్‌టుడే : లేఅవుట్లలో సౌకర్యాలు లేకుండా ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని లబ్ధిదారులు డిప్యూటీ కలెక్టరు, మండల ప్రత్యేకాధికారి పద్మావతి ఎదుట వాపోయారు. మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో మండలంలోని కొండాయపాలెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి, గండిపాలెంలో లేఅవుట్లను శనివారం పరిశీలించి లబ్ధిదారులతో సమావేశమయ్యారు. వసతులు కల్పిస్తే నిర్మాణాలు ప్రారంభిస్తామని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, ఈవోపీఆర్డీలు శ్రీనివాసరావు, రామకృష్ణ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. **వరికుంటపాడు:** నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కందుకూరు డీఎల్‌డీవో పద్మజ ఆదేశించారు. మండల పరిషత్తు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున, ఏవో వేణుగోపాల్, ఏపీవో ఆజంఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని శుద్ధజలం


వలేటివారిపాలెంలో పని చేయని ఆర్వో ప్లాంటు

కందుకూరు, వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: చిన్నారులకు సురక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంట్లు, ఆర్వో ప్లాంట్లు వృథాగా ఉన్నాయి. మినీ ఆర్వో ప్లాంట్లులో రోజూ నీరు పోసుకునేలా ఏర్పాటు చేయడం, వలేటివారిపాలెంలో బిగించకపోవడం, అంకభూపాలపురంలో పని చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఆర్వోప్లాంట్లు సంస్థలు కనీసం నిర్వహణ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో చాలా చోట్ల పని చేయడం లేదు. దీంతో ఆయా పాఠశాలలు హెచ్ఎంలు ఏర్పాటు చేసిన డబ్బానీరు, మరికొన్ని చోట్ల విద్యార్థులే డబ్బాలలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ❖ మినీ ఆర్వో ప్లాంట్ మాదిరిగానే ఉంటుంది. కనీసం ఆర్నెల్లకోసారి దీన్ని శుభ్రం చేసుకోవాలి. ఏడాదికోసారి ఫిల్టర్లు మార్చాల్సి ఉంటుంది.

ఆయా సంస్థల ప్రతినిధులకు సమస్యను తెలియజేశాం

మల్లికార్జునరావు, ఎంఈవో-2

వలేటివారిపాలెంలో సంస్థ ప్రతినిధులు బిగించకపోవడంతో వృథాగా ఉంది. ప్రస్తుతం చాలాచోట్ల పని చేయకపోవడంతో ఆయా సంస్థలకు తెలియపర్చాం. మిగతా పాఠశాలలో మరమ్మతులు చేయిస్తాం.

పెద్దలూ.. మీ పిల్లలే ఇక్కడుంటే ఏంచేస్తారు?

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు నియోజకవర్గంలోని పలు బీసీ, ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు అధ్వాన స్థితిలో ఉండటమే అందుకు నిదర్శనం. పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహం అధ్వానంగా ఉంది. పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. కిటికీలు సక్రమంగా లేక దోమల బెడదకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగసముద్రంలో రెండు వసతిగృహాలకూ పైకప్పు పెచ్చులూడాయి. వర్షాకాలం, చలికాలంలో విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదురుకానున్నాయి. మరుగుదొడ్లు సక్రమంగా లేవు. ఏళ్ల తరబడి నుంచి సమస్యలున్నా అధికార యంత్రాంగం మరమ్మతులకు కనీస చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. జవహర్ ఇంజినీరింగ్ అధికారులు వసతిగృహ భవనాలను పరిశీలించారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వసతి గృహ సంక్షేమాధికారి రత్నార్ తెలిపారు.


పెచ్చులూడిన బీసీ వసతి గృహం

ఉలవపాడు : ఉలవపాడు ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు భయంతో తగ్గుముఖం పట్టారు. ఇక్కడ ఎనిమిది గదులుండగా అందులో మొత్తం మూడు గదుల్లో మాత్రమే విద్యార్థులుంటున్నారు. మిగిలిన గదుల్లో ఒకటి స్టోర్ గది, మరొకటి కార్యాలయానికి ఉపయోగిస్తున్నారు. మరో మూడు గదులు పెచ్చులూడుతుండటంతో ఆ గదులలో విద్యార్థులు ఉండటం లేదు. గతేడాది 65 మంది విద్యార్థులుండేవారు. ప్రస్తుతం 43మందికే పరిమితమైంది.

రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో...

పూర్వ వార్డెన్ ఉద్యోగ విరమణ చేయడంతో ఇక్కడి బాధ్యతలు కందుకూరుకు చెందిన బాలికల వసతిగృహం వార్డెన్‌కు ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో విద్యార్థులు కొంతమంది బయటకు వెళ్లిపోయారు. వసతి గృహం గత పరిస్థితి పెచ్చులూడుతున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలులేవు. అప్పుడప్పుడు మరమ్మతులు చేస్తున్నా తిరిగి పరిస్థితి దిశగా అడుగులు పడటంలేదు. గతంలో ఇక్కడ సుమారు 100 మంది విద్యార్థులు వరకూ చదువుకున్నారు. కానీ, భవనం పరిస్థితి చూసి తల్లిదండ్రులు ఈ గృహానికి పంపించేందుకు సాహసించడం లేదు.


భవనం లోపల పెచ్చులూడి ఇనుప చువ్వలతోపాటు బయటపడిన కాంక్రీటు

అద్దె భవనంలోకి మారుస్తాం

భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. కానీ, ప్రస్తుతం విద్యార్థులను అద్దె భవనంలోకి మార్చాలని డీడీ ఆదేశించారు. త్వరలో అద్దెభవనం పరిశీలించి మార్చేందుకు ప్రయత్నిస్తాం.

కుమారి, వసతి గృహ సంక్షేమాధికారి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి: 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి: 80085 73944

? **సమస్య:** మండలంలోని శాంతినగర్ ఎస్టీకాలనీకి జాతీయ రహదారి నుంచి వెళ్లే మార్గంలో వీధిదీపాలు వెలగడం లేదు. - ఎస్సీ రాజ్
✓ **సమాధానం:** వెలిగించే ఏర్పాటు చేస్తాం. **-కేశవులు, పంచాయతీ కార్యదర్శి**
- గుడ్లూరు, న్యూస్‌టుడే

? పట్టణంలోని ఉత్తర జనతాపేటలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఫాగింగ్ చేయడం లేదు. **- మందల రామయ్య, ఉత్తర జనతాపేట**
✓ **సమాధానం:** పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు ఫాగింగ్ చేయిస్తాం. **- మెంతెం శ్రీనివాసులురెడ్డి, ఏఈ - కావలి, న్యూస్‌టుడే**

? దగదర్తిలోని కొత్త హరిజనవాడకు వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగాయి. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకయ్య, కాలనీవాసి**
✓ **సమాధానం:** ముళ్ల చెట్లు తొలగిస్తాం. **- ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి**

ఆర్టీసీ బస్సా.. పుష్పక విమానమా!



ఈ చిత్రం చూశారా! ఇందులో విశేషమేముందనుకుంటున్నారా.. ఫుట్‌పాత్‌లో నిలబడి విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం గుంతలో పడినా కుదుపులకు పడిపోయే ప్రమాదం ఉంది. కొండాపురం నుంచి కావలి వెళుతున్న బస్సులో పరిమితికి మించి వెళుతున్నారు.

- కొండాపురం, కలిగిరి, న్యూస్‌టుడే

విద్యుత్తు పరివర్తకం చుట్టూ మొక్కలే..

విద్యుత్తు పరివర్తకంతోపాటు ఫ్యూజు కేరియర్‌నూ కమ్మేశాయి తీగజాతి మొక్కలు. ఆత్మకూరు పంచాయతీలోని ఆదిఆంధ్రకాలనీకి వెళ్లే దారిలో వెంకటేశ్వర్లు సరివితోట వద్ద ఈ పరివర్తకం ఉంది. ఎక్కడో చేలల్లో, తోటల్లో ఉన్న పరివర్తకం కాదు ఇది. రోడ్డుపక్కనే ఉన్నదే ఇలా ఉంటే.. మిగతా వాటి పరిస్థితి ఆలోచించాలి మరి. రెండు రోజుల్లో సరి చేస్తామని ఏఈ శ్రీనివాసరావు వివరించారు. **-న్యూస్‌టుడే, ఉలవపాడు**



లారీ ఎక్కిన రైలు చక్రాలు



రవాణా వ్యవస్థలో రైల్వే శాఖ అతి పెద్దది. అటువంటి రైల్వే శాఖకు చెందిన బోగీలు, వ్యాగన్ల చక్రాలు లారీ ట్రాలీపై విజయవాడ వైపు వెళుతుండడాన్ని ప్రజలు ఆసక్తిగా చూశారు. బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. **- అల్లూరు, న్యూస్‌టుడే**

ఆదమరిస్తే ప్రమాదమే!

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం ఆటోలు, పాఠశాల వ్యాన్లు, ద్విచక్ర వాహనచోదకులతో రద్దీగా ఉండే ఆనందపురం దొండపాడు రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. దొండపాడు సమీపంలోని కుంట దగ్గర రహదారి అంచువరకు పూర్తిగా కోతకు గురైంది. వాహనాలు ఏ మాత్రం పక్కకు వచ్చినా ప్రమాదానికి గురయ్యే వీలుంది. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ అధికారులను వివరణ కోరగా.. పరిశీలించి పనులు చేపడతామన్నారు.



మున్సిపాలిటీనా ..మ్యూజియమా ?



ఈ చిత్రం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓ పనికి రాని ఆటో. ఇలాంటి పలు వాహనాలు కార్యాలయ ఆవరణలో పెట్టారు. రోడ్డుపై చెత్త శుభ్రం చేసే యంత్రం అనతికాలంలోనే మరమ్మతులకు గురై మూలకు చేరింది. ఈ విషయమై కావలి పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఒకటీ రెండురోజుల్లో వాటి విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, కావలి**

మహీధర్‌రెడ్డితో ఇంటూరి భేటీ

కందుకూరు పట్టణం : మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో తెదేపా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేశ్ కలిశారు. ఇద్దరూ ఏకాంతంగా పలు అంశాలపై చర్చించారు.

'వైకాపా పాలనతో తితిదే అపవిత్రం'

కావలి : గత వైకాపా పాలనలో తితిదే అపవిత్రతకు గురైందని తెదేపా, భాజపా, జనసేన పట్టణ కమిటీల అధ్యక్షులు జి.కిషోర్, కె.బ్రహ్మానందం, పబ్బా సాయి ఆరోపించారు. శనివారం కావలిలో విలేకర్లతో మాట్లాడారు. తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

దివి రోహిణీకుమార్‌కు నివాళి

కందుకూరుపట్టణం : మాజీ మున్సిపల్ ఛైర్మన్ దివి లింగయ్యానాయుడు సోదరుడు రోహిణీకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం జరిగిన దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరాం, దివి శివరామ్, ఇంటూరి రాజేశ్ హాజరయ్యారు.

జిల్లా స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల క్రీడాకారుల ఎంపిక.. వలేటివారిపాలెం : కందుకూరు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన చుండి ఆదర్శ పాఠశాల క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర తెలిపారు. కబడ్డీ పోటీలకు వి.మహేశ్, మోక్షిత్, యోగాకు లక్ష్మీప్రసన్న, లోకేశ్, మనివర్ధన్ ఎంపికయ్యారని వివరించారు.

అన్నదానానికి రూ.1,12,200 విరాళం..

కందుకూరు, వలేటివారిపాలెం : మాలకొండలో అన్నదానానికి వలేటివారిపాలెంకు చెందిన వలేటి నాగేశ్వరరావు రూ.1.12.200ల చెక్కును శనివారం ఆలయ డిప్యూటీ కమిషనరు సాగర్‌బాబుకు అందజేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వివిధ రూపాలలో రూ.7,04,120లు సమకూరినట్లు ఆలయ డిప్యూటీ కమిషనరు చెప్పారు.

గోశాలలో గరుకు స్తంభాల ఏర్పాటు

బిట్రగుంట: కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం దిగువన ఉన్న గోశాలలో 9 గరుకు స్తంభాలు ప్రతిష్ఠించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల గోసంరక్షణ అధ్యక్షుడు బెల్లంకొండ అరుణ్ పాల్గొన్నారు. పూజల్లో ఆలయ ప్రధానార్చకుడు సత్యనారాయణాచార్యులు ఈవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

గుడ్లూరు ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు

గుడ్లూరు : ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో పనిచేసిన ఆయన అనంతరం కందుకూరుకు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి ఇక్కడకు ఇన్‌ఛార్జిగా వచ్చారు.

ఏఈ సుధీర్ బాధ్యతల స్వీకరణ



అల్లూరు : జల వనరుల శాఖ ఏఈగా కాకు సుధీర్ శనివారం విధుల్లో చేరారు. వెంకటాచలం కనుపూరు కాలువ ఏఈ పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ డెల్టాలో చివరి ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాలకు సామాగ్రి బహూకరణ..

వింజమూరు : మండలంలోని నల్లగొండ్ల ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచి అన్నపురెడ్డి ప్రమీలమ్మ, భర్త వెంగళరెడ్డి టేబుల్, బీరువా తదితర విద్యా సామగ్రి శనివారం బహూకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కందల మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఉదయగిరి : పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కల్లూరి జయసింహారెడ్డి రూ. 15 వేలు విలువైన వాటర్ కూలర్‌ను వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఇప్పటికే పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు రూ. 40 వేలు విలువగల సామాగ్రిని అందజేశారన్నారు.

'నష్టపోయా.. న్యాయం చేయాలి'..కావలి : నేరాలు చేస్తున్న నిందితుడికి వైకాపా నాయకులు వంతపాడడంతో రూ.1.5 కోట్ల వరకు నష్టపోయానని విజయవాడకు చెందిన బంగారం వ్యాపారం చేసే మహిళ కత్తుల వనజ వాపోయారు. గతంలో నేరాలు చేసి ప్రస్తుతం జైలులో ఉన్న దేవరకొండ సుధీర్ తనను మోసగించాడన్నారు. శనివారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో తన బంధువు వెంకటేశ్‌తో కలిసి మాట్లాడారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి ..

ఉదయగిరి : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని వైద్యుడు వేణుగోపాల్ సూచించారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో జమాతే ఇస్లామి హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో నెలరోజులపాటు జరిగిన నైతికతే నిజమైన స్వేచ్ఛ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతంపై ప్రత్యేక దృష్టి

కలిగిరి : వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను మార్చి నెలాఖర్లోగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగేశ్వరరావు తెలిపారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో సురేష్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచి కొండారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు దాత సాయం


దాతను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కావలి గ్రామీణం: మండల పరిధిలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి దాత సాయం చేయడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ సుశీల్‌కుమార్‌ప్రియ పేర్కొన్నారు. అలహాబాద్ ఎన్ఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శివదత్‌కుమార్ శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 25 వేలు నగదు అందజేశారు. ఆయన్ను సన్మానించారు.

ఉలవపాడు ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ..

ఉలవపాడు : ఉలవపాడు ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మెడికల్ క్యాంపుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు హరీష్ పాల్గొన్నారు.

తుమ్మచెట్లు నరకడంపై ఫిర్యాదు..

కలిగిరి : మండలంలోని చినఅన్నలూరు చెరువు పరిధిలో ఉన్న నల్లతుమ్మ చెట్లను కొందరు నరుకుతున్నట్లు స్థానికులు జలవనరుల శాఖ ఏఈ శ్రీనాథ్‌కు శనివారం పలువురు ఫిర్యాదు చేశారు. ఆ చెట్ల అమ్మకాలతో వచ్చిన సొమ్మును గ్రామంలోని దేవస్థానానికి కేటాయించనున్నట్లు స్థానికులు తెలిపారని వారికి ఏఈ వివరించారు.

నేడు కరెంటు సరఫరాకు అంతరాయం ..

కలిగిరి : కలిగిరిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దినేష్ తెలిపారు. నూతన లైన్ల నిర్మాణంలో భాగంగా అంతరాయం ఉంటుందని..వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటేశ్వర స్వామికి పల్లకీ సేవ ..దగదర్తి : దగదర్తిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం రాత్రి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కిషోర్ భోజన వసతి కల్పించారు.

కమ్యూనిజం కలకాలం.. కావలి : ప్రపంచ దేశాల్లో కమ్యూనిజం కలకాలం వర్ధిల్లుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన పార్టీ మూడో మహాసభలో పాల్గొన్నారు. కావలి పట్టణ కమిటీ కార్యదర్శిగా మరోమారు పసుపులేటి పెంచలయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మాజీ ఉప మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామలింగాపురంలో 'ఇది మంచి ప్రభుత్వం'

దగదర్తి : మండలంలోని రామలింగాపురంలో శనివారం తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. స్థానిక తెదేపా నాయకుడు గాలి సురేష్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఉలవపాడు : గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. బద్దిపూడి, భీమవరంలో శనివారం సీఐ, ఎస్సై పల్లెనిద్ర చేశారు. స్థానికులకు పలు జాగ్రత్తలు వివరించారు.

నిరుపేదకు ఉపాధ్యాయులు, విద్యార్థుల సాయం

వలేటివారిపాలెం : ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైన దువ్వూరి మహేశ్‌కు నలదలపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.10,630 సాయం చేశారు. ఈ నగదును బాధిత కుటుంబానికి శనివారం హెచ్ఎం బి.మాధవరావు అందజేశారు.

క్లబ్‌పై పోలీసుల దాడి..

కావలి : పట్టణంలోని అఫిషియల్ క్లబ్‌పై ఒకటో పట్టణ ఎస్సై సుమన్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా అనుమతుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

కులదూషణపై డీఎస్పీ విచారణ

లింగసముద్రం : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కులదూషణ కేసుపై కందుకూరు ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రీధర్ బాబు శనివారం విచారణ చేపట్టారు. రాళ్లపాడుకు చెందిన మాలకొండయ్యకు ఇదే గ్రామంలోని ముగ్గురి మధ్య పొలం వివాదం జరిగింది. తనను కులం పేరుతో దూషించారని మాలకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు: ఎస్పీ


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

జలదంకి, దుత్తలూరు, ఉదయగిరి, న్యూస్‌టుడే : పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జి.కృష్ణకాంత్ హెచ్చరించారు. శనివారం జలదంకి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనుమానాస్పద మరణాలు, హత్యలు, లైంగిక, వరకట్న వేధింపుల కేసులు, గంజాయి తదితర వాటిపై వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, సీఐ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు. దుత్తలూరు, ఉదయగిరి పోలీసుస్టేషన్లను సందర్శించారు. ఆయన వెంట సీఐ వెంకటరావు, ఎస్సైలు ఆదిలక్ష్మి, ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కలిగిరి, వరికుంటపాడు : రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, హెల్మెట్‌వినియోగం, సీటు బెల్టు పోలీసు సిబ్బంది ధరిస్తూ వాటి ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనిఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు.గ్రామాల్లో గ్రామస్థులతో సమావేశంనిర్వహించి సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించి, నేరాలను నియంత్రించాలన్నారు.ఎస్సై ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు. వరికుంటపాడులో స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.


ఏకరూప దుస్తుల అందజేత

గుడ్లూరు : జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన రామదూత ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల క్రితం కందుకూరులో జరిగిన డివిజన్ స్థాయి పాఠశాలల క్రీడల్లో ఆశ్రమానికి చెందిన విద్యార్థులు వాలీబాల్‌లో కె.భార్గవ్, వి.తారక్, నరేంద్ర, చందు, వెంకటగిరి, కబడ్డీలో నరేంద్ర, యోగేంద్ర, ఖోఖోలో కిశోర్, అథ్లెటిక్స్‌లో భార్గవ్, సి.గిరీశ్, పి.చరణ్, సందీప్, కె.మధు, సందీప్, భాను, అనిల్ ఎంపికయ్యారన్నారు. దాతల సహకారంతో క్రీడాదుస్తులు అందించామని నిర్వాహకులు చౌదరి, శ్రీనివాస్ తెలిపారు.

ప్రేమికుడిపై దాడి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఓ వివాహితను తనతో తీసుకెళ్లడంతో అతనిపై కొందరు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై బాలనాయక్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. వీరిద్దరున్న ప్రదేశానికి యువకుడి బంధువులు వెళ్లి.. గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తీసుకొస్తుండగా.. మార్గమధ్యలో మాచవరం వద్ద దారికాచి యువతి బంధువులు దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే


మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పుష్ప గుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే సురేష్

వింజమూరు : నియోజకవర్గంలోని 143 పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలోశనివారం సమావేశం నిర్వహించారు. గుండెమడకల రిజర్వాయరు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సురేష్ అన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ కావలి ఈఈ వేణుగోపాల్, ఉదయగిరి డీఈ సీహెచ్‌మణికుమార్, పీఆర్ఐ ఉదయగిరి డీఈఈ ఎస్ వెంకటేశ్వరరావు, వింజమూరు ఏఈ, ఇరిగేషన్ ఈఈ ఆర్. వెంకటేశ్వర్లు, డీఈలు కె.చంద్రమౌళి, టి.రమణారావు, ఏఈలు సీహెచ్ వేణు, కె.సురేష్, ఒ.మహేంద్ర, పొలిటికల్ మేనేజర్ మాలెపాటి చైతన్య పాల్గొన్నారు. అంతకు ముందు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల గుండా వెళుతున్న ఉత్తర కాలువకు నీరు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్దిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల లక్ష్మణరావు ప్రకాశం జిల్లా పామూరుకు వెళుతుండగా.. ఆ పట్టణంలోని చికెన్ దుకాణానికి చెందిన ప్రసాద్ పెద్దిరెడ్డిపల్లెకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో నాయకుడి దేవాలయం సమీపంలో వీరి వాహనాలు ఢీకొనగా ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం పామూరు ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం

మద్దిపాడు: దొడ్డవరప్పాడులో ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ 21న జలదంకి మండలం కమ్మవారిపాలెం నుంచి బాతులు మేపుకొనేందుకు వచ్చి దొడ్డవరప్పాడు పొలాల్లో రెండు కుటుంబాల వారు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. 26న చిన్నారులను అక్కడే ఉంచి, వాళ్లతో పాటు ఉంటున్న పేరం లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి చూస్తూ ఉండమని చెప్పి తండ్రి నాగులూరి లాజరు, అతడి భార్య స్వగ్రామానికెళ్తామని చెప్పి వెళ్లారు. మరుసటి రోజుత గుడిసెలు వద్దకు వచ్చి చూడగా పిల్లలు కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశు వైద్యులు లేక.. సేవలు అందక

దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం, న్యూస్‌టుడే

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు వైద్యశాలల్లో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. పలు వైద్యశాలల్లో వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తుండడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యాధికారులకు అదనపు బాధ్యతలు ఇస్తుండడంతో పూర్తిస్థాయిలో వైద్యం అందించలేక సతమతమవుతున్నారు.

నియోజకవర్గంలో ఎనిమిది మండలాలున్నాయి. వీటిల్లో ప్రాంతీయ వైద్యశాలలు నాలుగు, పశువైద్యశాలలు 15, గ్రామీణ వైద్యశాలలు మూడు ఉన్నాయి. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 60 శాతం మంది పాడి పశువులు, ఆవులు, గొర్రెలు, మేకలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో పశువులకు ప్రతి సీజన్‌లో వివిధ రకాల వ్యాధులు సోకుతుంటాయి.

నియోజకవర్గంలో ఇలా...

నియోజకవర్గంలో దుత్తలూరు, వింజమూరు, జలదంకి, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో వైద్యాధికారుల కొరత ఉంది. దుత్తలూరు మండలంలోని నర్రవాడ, నందిపాడు, జలదంకి మండలంలోని జలదంకి, బ్రాహ్మణక్రాక, వింజమూరు మండలంలోని చాకలకొండ, గుండెమడకల, తమిదపాడు, ఉదయగిరి మండలంలోని గండిపాలెం, సీతారామపురంలోని బసినేనిపల్లి పశువైద్యశాలల్లో రెగ్యులర్ పశువైద్యాధికారులు లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా ఉన్న పశువైద్యశాలలకు ఇన్‌చార్జులను నియమించడంతో ఆయా వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఇన్‌చార్జులుగా ఉన్న వారు ఏ వైద్యశాలలోనూ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నారు. రెగ్యులర్ వైద్యాధికారులు లేని వైద్యశాలల్లో అక్కడ పనిచేసే కాంపౌండర్లు, ఇతర సిబ్బంది సేవలు అందిస్తున్నారు.


రెగ్యులర్ పశువైద్యాధికారి లేని బసినేనిపల్లి పశువైద్యశాల

కొరత ఉన్న మాట వాస్తవమే

చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ, దుత్తలూరు

పలు వైద్యశాలల్లో పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. ఉన్న వారినే ఖాళీగా ఉన్న పశువైద్యశాలలకు ఇన్‌చార్జులుగా నియమించాం. పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి నగరపంచాయతీలోని ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్-14, -17 పోటీల్లో భాగంగా ఫెన్సింగ్ విభాగంలో బాల బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు విద్య తొలిమెట్టు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనకు విద్య తొలిమెట్టు అని ఎంఈవో వెంకటరత్నం తెలిపారు. బుచ్చి ఎంఈవో కార్యాలయంలో మండల స్థాయి పోటీ పరీక్షలు శనివారం జరిగాయి. వీరిని ప్రత్యేకంగా అభినందించారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రిసోర్సు గ్రూపు సభ్యులు సుధీర్, వసంత, మల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని బట్టేపాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులు అర్చన, ప్రణతిలు రెజ్లింగ్‌లో అండర్ 17విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పెంచలయ్య, పీడీ వెంకటకృష్ణయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

అనంతసాగరం: ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అనంతసాగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర 200 మీటర్ల పరుగు విభాగంలో జి. హేమంత్ ద్వితీయ స్థానం, అండర్-14 బాలికల 80 మీటర్ల పరుగు విభాగంలో ఎస్‌కే మహీన్ ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: ఇందుకూరుపేట మండలం రాముడుపాలెంలో రెండు రోజులకొకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. – మల్లికార్జున్

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – నాగేంద్రబాబు, ఎంపీడీవో

? పొదలకూరు పంచాయతీ మారుతీనగర్, శ్రామికనగర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా దీపాలు వెలగడం లేదు. – ప్రభాకర్, స్థానికుడు

✔ సాంకేతికపరమైన సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించి వీధిదీపాలు వెలిగేలా చూస్తాం.

– దొరబాబు, పంచాయతీ కార్యదర్శి

గంధోత్సవాలకు సర్వం సిద్ధం

ఏఎస్‌పేట, కసుమూరు దర్గాలకు తరలివస్తున్న భక్తులు



విద్యుద్దీప కాంతుల్లో కసుమూరు దర్గా

న్యూస్‌టుడే, కసుమూరు(వెంకటాచలం)

సర్వమత ఏకతకు ప్రతీకగా నిలిచే కసుమూరు మస్తాన్‌వలీ(హజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాద్రీ ఉరఫ్ కాలేషా పీర్ మస్తాన్‌వలీ) దర్గా 247వ గంధ మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరుగనున్న ఈగంధ మహోత్సవాలకు భారీగా భక్తులు తరలిరానున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు భక్తులకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచే భక్తుల తాకిడి నెలకొంది. వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● ఆదివారం నుంచి ప్రారంభం కానున్న గంధోత్సవాలకు రెండు లక్షల మంది వస్తారని భావిస్తున్నారు, రూ.14 లక్షలతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టరు ఖుదావన్ తెలిపారు. దర్గాతో పాటు, చందన్‌మహల్, చెరువుకట్ట తదితర మొత్తం ఆరు చోట్ల తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి, నిరంతరం పారిశుద్ధ్యం మెరుగునకు కార్యక్రమాలు చేపట్టనున్నటు చెప్పారు. తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులతో పాటు దర్గా ప్రాంగణం, చందన్ మహల్, చెరువు కట్టపైనా షామియానాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సేదతీరేందుకు మూడు డార్మెంటరీలు సిద్ధం చేశామని, మూడు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఆర్టీసీ సంస్థ మూడు రోజుల పాటు నెల్లూరు నుంచి కసుమూరుకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

నేటి కార్యక్రమాలు... : గంధ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి 11 గంటలకు చందన్ మహల్ నుంచి గంధం గుర్రంపై బయల్దేరి సోమవారం ఉదయం ఐదు గంటలకు మస్తాన్‌వలీ దర్గాకు చేరుతుంది. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ సిజారా(వంశస్థుల పేర్లు) చదువుతారు. అనంతరం పీఠాధిపతి గంధ లేపనాన్ని దర్గాకు పూస్తారు. అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు.

అనుమసముద్రంపేట: జిల్లాలోని ఏఎస్‌పేట దర్గా దేశంలోనే ప్రసిద్ధి చెందింది. ఏటా నిర్వహించే గంధమహోత్సవానికి వేలాదిగా తరలివస్తుంటారు. ఏటా పెరుగుతున్న యాత్రికులకు సరిపడ సదుపాయాలు కరవవుతున్నాయి.



ఏఎస్‌పేట దర్గా వద్ద భక్తులు

మౌలిక వసతుల కరవు: ఆదివారం నుంచి మూడు రోజులపాటు జరిగే గంధోత్సవాలకు హాజరయ్యే భక్తులకు తాగునీటి సరఫరా చేయడంలో ఆశాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా కుళాయిలు ఏర్పాటు చేయడం, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడం లాంటివి సక్రమంగా జరగలేదు. దర్గాకు ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా.. వసతులు కల్పించడంలో మాత్రం వక్ఫ్‌బోర్డు విఫలమవుతుంది. ఈ ఏడాది కేవలం రూ.అయిదు లక్షలు మాత్రమే కేటాయించినట్లు తెలుస్తోంది. గతం కంటే ఈ సారి పలు చోట్ల బయోటాయెల్‌ట్స్ ఏర్పాటు చేసినా.. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఇవి ఏమాత్రం సరిపోవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాధారణ సమయాల్లోనే.. ఫోన్లకు ఆయా టవర్ల నుంచి సిగ్నల్స్ అందని పరిస్థితి. ఉత్సవాల సమయంలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. దర్గాకు నడిచే బస్సు సర్వీసులు నిలిపేందుకు బస్టాండు సౌకర్యం లేదు. రోడ్డుమీదే నిలపాల్సిన పరిస్థితి వస్తోంది. రాకపోకలకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అద్దె గదుల ధరల పెంపుతో.. : గంధోత్సవాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇదే అదనుగా స్థానికంగా అద్దె గదుల ధరలను పెంచేస్తున్నారు. సాధారణ సమయంలో రూ.500లు ఉన్న రోజు అద్దె.. ప్రస్తుతం వెయ్యి నుంచి రెండు వేలు దాకా ఉంది. మరో గత్యంతరం లేకపోవడంతో యాత్రికులు భారమైనా భరించాల్సి వస్తోంది.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి



సంగంలో మాట్లాడుతున్న రమేష్‌నాయక్

చేజర్ల, సంగం, ఆత్మకూరు, మర్రిపాడు, మనుబోలు, బుచ్చి, న్యూస్‌టుడే: పక్కా గృహ నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులపై శనివారం చేజర్ల, ఆదూరుపల్లిలో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. సొంత స్థలాల్లో నిర్మించే కేటగిరీ-1, 2 ఇళ్లను మార్చి లోగా పూర్తిచేయాలన్నారు. బిల్లులు చెల్లింపు, సిమెంటు, ఇసుక, నిర్మాణ సామగ్రి, రుణాల మంజూరులో జాప్యం లేకుండా ఎంపీడీవో, ఏఈలు చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ రావి పెంచలరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకుంటున్న పక్కా ఇళ్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సంగం మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ సూచించారు. ఆత్మకూరు గ్రామీణ మండలం బోయిళ్ల చిరువెళ్లలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగింది. మనుబోలు మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కోవూరు,న్యూస్‌టుడే: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్లలో భారీ వర్షం

చేజర్ల, న్యూస్‌టుడే: నీటి కోసం అవస్థలు పడుతున్న మండల ప్రజలకు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. వాగుల్లో నీరు చేరితే పశువులు, జీవాలకు తాగునీటి సమస్య తీరుతుందని రైతులు ఆనందిస్తున్నారు.

ఉత్తర కాలువకు గండి కొట్టే యత్నం



మండలంలోని ఖాన్ సాహెబ్ సమీపంలో సోమశిల ఉత్తర కాలువకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం గండి కొట్టే ప్రయత్నం చేశారు. పొలాలకు నీటిని మళ్లించేందుకు డ్రిల్లింగ్ యంత్రంతో కాలువ గట్టుకు రంధ్రం చేసి పైపు ఏర్పాటు చేసేందుకు విఫల యత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న తెలుగుగంగ డీఈ మురళీ కృష్ణ, సిబ్బందితో అక్కడి చేరుకుని పరిశీలించారు. కాలువ పటిష్ఠను దెబ్బతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

– న్యూస్‌టుడే, మర్రిపాడు

తాగునీటి బోరుకు మరమ్మతులు

స్పందనకు వందనం



మండలంలోని కసుపూరు పంచాయతీ చింతలపాలెంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును వినియోగంలోకి తెచ్చారు. చింతలపాలెంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురికావడంతో నాలుగు రోజుల క్రితం 'ఈనాడు'లో 'అలంకారప్రాయంగా బోరు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది స్పందించి గ్రామానికి వెళ్లి బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు పెంచండి

ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు జరిగేలా కృషి చేయాలని డీఐవో ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాక్సినేషన్‌కు సంబంధించిన పలు దస్త్రాలను, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణిని పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాగరాజుతోపులో 104 వాహనం ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం గ్రామాల్లో తొమ్మిది గంటల్లోపే ప్రారంభించాలన్నారు. – న్యూస్‌టుడే, ఇందుకూరుపేట



ప్రణాళికతో సాగితే విజయం

విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ లక్ష్యలను నిర్దేశించుకుని పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే తప్పక విజయం సాధిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు జి.దయాకరరావు తెలిపారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'శిల్ప నీవే.. శిల్పి నీవే.. శిల్పానివి నీవే' శీర్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం



గుత్తేదారు మోసం చేశారని ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: గృహాలు నిర్మిస్తానని నగదు తీసుకుని నిండా ముంచేశారని లబ్ధిదారులు వాపోయారు. మండలంలోని నాగమాంబాపురంలో జనసేన ఆధ్వర్యంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమావేశం శనివారం జరిగింది. బాధితులు పెద్దఎత్తున వచ్చి జనసేన నాయకులకు తమ గోడు వినిపించారు. జనసేన నాయకులు హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ బుచ్చిలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో భారీ మోసం జరిగిందన్నారు. బాధితులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లారన్నారు. వారి ఆదేశాల మేరకు పరిశీలించేందుకు పది గృహాలు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు.

బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, న్యూస్‌టుడే: గృహనిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి సత్యవాణి తెలిపారు. కొడవలూరులోని దర్గా సంఘంలో గృహ నిర్మాణదారుల సమావేశం శనివారం జరిగింది. బుచ్చి మండల పరిషత్తు సమావేశ మందిరంలో మెప్మాపీడీ రవీంద్ర సమావేశం ఏర్పాటుచేశారు. కట్టుబడిపాళెంలో ఎంపీడీవో నరసింహారావు గృహనిర్మాణదారులతో మాట్లాడారు.

జలాశయం సందర్శన

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయాన్ని నెల్లూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాజేంద్ర కుమార్ శనివారం సందర్శించారు. జలాశయం, ఉత్తర, దక్షిణ కాలువలను పరిశీలించి నీటి నిల్వలపై ప్రాజెక్టు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన సోమేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మర్రిపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

మర్రిపాడు: మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ కృష్ణ కాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులను తర్వగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పోషకాహారంతో ఆరోగ్యం లభిస్తుందని పర్యవేక్షకురాలు శకుంతల తెలిపారు. బుచ్చి నగర పంచాయతీలోని శాంతినగర్, కాశీపాళెం, పాతూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు శనివారం జరిగాయి.

మహిళా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు శ్రావణ్ తెలిపారు. బుచ్చిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మహిళల సమస్యలు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొడవలూరు, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు బండ్ల సురేంద్రపై దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తెదేపా జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షులు నాశం ప్రసాద్, తెదేపా ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు తువ్వర ప్రవీణ్ కోరారు. శనివారం కొడవలూరు ఎస్సై కోటిరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీశ్ పటేల్ కోరారు. పోర్టులో శనివారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, వ్యర్థాలు తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు దేశం మొత్తం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం పోర్టులో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించి, మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పోర్టు సీవోవో రాజన్ బాబు, ఈహెచ్ఎస్ మేనేజర్ బొల్లా శ్రీను పోర్టు అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పోర్టు అధికారులు, ఉద్యోగులు

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక



మనుబోలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన **సుమంత్** ఎంపికైనట్లు శనివారం వ్యాయామ అధ్యాపకులు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో జరిగిన అండర్-19 స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో 400 మీ, పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు అభినందించారు.

తిరుపతి లడ్డూపై అసత్య ప్రచారాలు తగవు

పొదలకూరు, కోవూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, బుచ్చి, న్యూస్‌టుడే : పొదలకూరు శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మి గోదా సమేత వెకంటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రాయశ్చిత్త పూజలో పాల్గొన్నారు. కాకాణి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరినట్లు పేర్కొన్నారు. తిరుపతి లడ్డూపై అసత్యప్రచారం చేయడం తగదని వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని లక్ష్మినగర్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకొని సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. మనుబోలులోని విష్ణు ఆలయంలో, తోటపల్లిగూడూరు మండలంలోని కోవెరపాలెం గ్రామంలోని శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మక్తాపురంలో వైకాపా ఇసుక దందా

సంగం, న్యూస్‌టుడే: మక్తాపురంలో వైకాపా ఇసుక దందాని గ్రామస్థులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. పెన్నానదికి అత్యంత సమీపమైన ఈ గ్రామం నుంచి వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుకను యథేచ్ఛగా తరలించేవారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పుడు ఇదే వ్యవహారం కొనసాగడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఫలితంగా దారి మార్చి అనసూయనగర్ మీదుగా తరలించారు. దానిపైనా అధికారులకు ఫిర్యాదులు అందడంతో అక్రమ రవాణా జరగకుండా యంత్రసాయంతో అడ్డుకట్టలు వేశారు. తిరిగి ఇప్పుడు పెన్నానది నుంచి ఇసుకను తరలించడం ప్రారంభించారు. దాంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. కొన్ని ట్రాక్టర్లు మాయమవగా.. ఒక ట్రాక్టరు పట్టుబడింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తీరలించి కేసు నమోదు చేశారు.



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపకులపతి, ఆచార్యులు

సమాజ ఉన్నతికి జాషువా రచనలు దోహదం

వెంకటాచలం, విడవలూరు, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందిన గుర్రం జాషువాను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని వీసీ విజయభాస్కర రావు సూచించారు. వీఎస్‌యూలో శనివారం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వీసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... జాషువా రచనలు సమాజానికి ఎంతో మేలు చేశాయన్నారు. నేటి తరానికి గుర్రం జాషువా రచనలు ఆదర్శప్రాయమని విడవలూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత తెలిపారు. విడవలూరు పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వావిళ్ల హైస్కూల్ ప్లస్ పాఠశాలలో చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

కాశీపాళెంలో మార్కెట్ పునరుద్ధరించండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని కాశీపాళెం మార్కెట్‌కు ఘన చరిత్ర ఉందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ నరసింహస్వామి తెలిపారు. శనివారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి స్థలం పరిశీలించారు. పాతూరు, కాశీపాళెం, బెల్దారిపాళెం, రామకృష్ణనగర్, మంగలికట్ట, కోదండరామపురం ప్రాంతాల వారికి మార్కెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వెంటనే పునరుద్ధరించాలన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

కామాక్షితాయికి విశేష పూజలు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జున స్వామి కామాక్షితాయికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

గైర్హాజరైన సభ్యుల సంతకాల ఫోర్జరీ

కలువాయి: కలువాయి చెరువు మత్స్యకార సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి కొందరు సభ్యులను పిలవకుండా, సమావేశానికి హాజరైనట్లు ఫోర్జరీ సంతకాలు చేశారని ఆ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆరోపించారు. కలువాయిలోని పాండురంగస్వామి ఆలయంలో శనివారం మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షులు, సభ్యులు సమావేశమయ్యారు వారు మాట్లాడుతూ.. 2022 ఏప్రిల్‌లో నూతన పాలకవర్గం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క సమావేశాన్ని నిర్వహించలేదని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారుల విచారణలో ఫోర్జరీ సంతకాల ఉదంతం బయట పడిందన్నారు.

పీహెచ్‌సీలో దస్త్రాల పరిశీలన

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి పరిశీలించారు. అడల్ట్ బీసీజి వ్యాక్సినేషన్‌పై సిబ్బందితో మాట్లాడి దస్త్రాలు పరిశీలించారు.

నెలాఖరులోగా గృహాలు పూర్తి చేయండి

కలువాయి, రాపూరు, సైదాపురం: కలువాయి సచివాలయంలో శనివారం మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో గోవర్ధన్ మాట్లాడుతూ గృహాలు మంజూరైన లబ్ధిదారులు మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. రాపూరు మండలంలోని అన్ని సచివాలయాల్లో మార్చి 25 లోగా మంజూరైన గృహాలను వెంటనే పూర్తి చేయకుంటే రద్దు చేస్తామని హౌసింగ్ ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. సైదాపురం ఎంపీడీవో శివకుమార్ పలు లేఅవుట్లను పరిశీలించారు.

వరద బాధితులకు చేయూత

రాపూరు: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం చేసేందుకు గుడ్ షెప్పర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. మొత్తం రూ30,819 నగదు పాఠశాల ప్రిన్సిపల్ రాజారత్నం, ఉపాధ్యాయుడు ఈశ్వర్ చేతుల మీదుగా పాఠశాలల కమిటీ నాయకులు శివకుమార్‌కు అందజేశారు.

బాధితురాలి ఖాతాలో రూ.57 వేలు మాయం

కలువాయి, న్యూస్‌టుడే: మహిళ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.57 వేల నగదు సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన కలువాయి మండలం ఎర్రబల్లిలో జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. ఎర్రబల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఆశ కార్యకర్తగా పనిచేస్తోంది. ఈనెల 21వ తేదీ ఆమె చరవాణికి ఆధార్ నంబర్‌పై రెండు ఓటీపీలు వచ్చాయి. మరుసటి రోజు చరవాణి సిమ్ బ్లాక్ అయింది. పొదలకూరుకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసి, సిమ్ తీసుకున్నారు. 26వ తేదీ బ్యాంకు ఖాతాలో పరిశీలించగా నగదు లేకపోవడంతో ఆందోళనకు గురై వెంటనే బ్యాంకు వద్దకెళ్లారు. ఆమె ప్రమేయం లేకుండానే 23వ తేదీ రూ.5 వేలు, 24న రూ.20 వేలు, రూ.30 వేలు, రూ.2400, రూ.70, రూ.50 మొత్తం పేటీఎం ద్వారా కట్ అయ్యాయి. సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రామతీర్థంలో భగ్గుమన్న పాతకక్షలు

ఇరువర్గాల ఘర్షణలో నలుగురికి గాయాలు

విడవలూరు, న్యూస్‌టుడే: పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయాలైన ఘటన మండలంలో శనివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. విడవలూరు మండలం రామతీర్థంలో బాబూరుకు చెందిన రెండు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. శుక్రవారం కాలువ పూడిక విషయంలో వాగ్వాదం జరిగింది. పాత కక్షలతో ఒక్కసారిగా కర్రలు, ఇనుప రాడ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో లక్ష్మయ్య, రామకృష్ణ, శేషమ్మ, శ్రీనాథ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులు నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసుల వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

మత్స్యశాఖ జేడీ ఫిర్యాదు.. 9 మందిపై కేసు నమోదు

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయి చెరువు సహకార సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, మరో ఎనిమిది మంది డైరక్టర్లపై మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై సుమన్ తెలిపారు. 2022 ఏప్రిల్ నెలలో నూతన పాలకవర్గం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కొందరిని పిలవకుండా, వారి సంతకాలు ఫోర్జరీ చేసి హాజరయ్యారని నమోదు చేశారన్నారు. దీనిపై జేడీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

రేషన్ దుకాణ నిర్వహకుడిపై..

వెంకటాచలం, న్యూస్‌టుడే: చవటపాళెం రేషన్ దుకాణ నిర్వహకుడిపై వెంకటాచలం ఆర్ఐ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. అధికారులు రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా... దుకాణంలో ఉన్న బియ్యం నిల్వలు, రికార్డుల్లో నమోదులో వ్యత్యాసం ఉన్నాయన్నారు.

మేకల చోరీపై..

వెంకటాచలం: తాటిపర్తిపాళెంకు చెందిన మల్లి నాగూర్‌కు చెందిన 11 మేకలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

శివ శివా.. ఆలయం వద్దే కోళ్ల వ్యర్థాలా!

న్యూస్‌టుడే, సంగం

దువ్వూరులోని పురాతన చరిత్రగల గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపల చెరువుల సాగుదారులు విచ్చలవిడిగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని దుర్గంధమయంగా చేస్తున్నారు. భక్తులు అభ్యంతరం చెప్పినా ఖాతరు చేయడం లేదు.

మట్టి దిబ్బలను తొలగించి..: చోళుల కాలంలో దువ్వూరు గ్రామం సైన్యానికి కేంద్రంగా ఉండేది. ఆలయం పడమర వైపున గతంలో పాటి మట్టి దిబ్బలుండేవి. నాటి రాచరిక గుర్తులుగా ఉన్న పలు రకాల నాణేలు లభిస్తుండేవి. అలాంటి మట్టి దిబ్బలను పదేళ్ల క్రితం కొందరు తొలగించి రొయ్యల చెరువులేర్పాటు చేశారు. కాలక్రమేణా చేపల చెరువులుగా మార్చారు.

భక్తులకు తప్పని ఇబ్బంది : గత రెండేళ్లుగా చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. వాటిని తీసుకువచ్చే వాహనాలను ఆలయం వద్దనే నిలుపుతున్నారు. ఫలితంగా వచ్చే చెడువాసనతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత సమయం ఆలయంలో ఉండాలంటే సాధ్యపడటం లేదు. చేపల చెరువుల యజమానులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోకపోగా.. కోళ్ల వ్యర్థాలను వేయడం మరింత అధికం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని భక్తులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు తెలియచేసి వారి ఆదేశాలతో చర్యలు చేపడతామన్నారు.



చెరువులో కోళ్ల వ్యర్థాలు

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: స్టోన్‌హౌస్‌పేట లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 12 వరకు నిర్వహిస్తు న్నట్లు ఆ దేవస్థానం పాలక మండలి గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్ తెలిపారు. దేవస్థానం లో శనివారం రాత్రి జరి గిన కార్యక్రమంలో ఆయన పాలక మండలి సభ్యులతో కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

నూతన కమిటీ ఎన్నిక

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ అసోసియే షన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక శనివారం రైల్వేఫీడర్స్ రోడ్డులో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఎం. నరేష్ ఎన్నికల అధికారిగా, షేక్ మస్తాన్ అసిస్టెం ట్‌గా వ్యవహరించారు. సంఘం నూతన అధ్యక్షు నిగా షేక్ ఎలియాజ్ బాషా(నెల్లూరు), ఉపాధ్యక్షు డిగా జె. వినయ్(కోట), కార్యదర్శిగా జి. సురేష్(పొద లకూరు), జాయింట్ కార్యదర్శిగా యు. బ్రహ్మయ్య(మర్రిపాడు), కోశాధికారిగా ఎం. నరస సింహం(కోట), సలహాదారుగా పి. ప్రభాకర్(వింజ మూరు) ఎన్నికయ్యారు. నూతన కమిటీ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి డి. శ్రీనివాసులు, సహాయ అధికారి ఎస్. వేణుగోపాల్ మర్యాదపూర్వ కంగా కలిశారు.

గృహ నిర్మాణ సంస్థ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్‌గా మురళి శని వారం నగరంలోని జిల్లా కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు జిల్లా గృహ నిర్మాణ సంస్థలోనే ఎస్టాబ్లిష్ మెంట్ సెక్షన్‌లో సహాయ మేనేజర్‌గా పనిచేసే వారు. ఉద్యోగోన్నతిపై ఆయన్ని మేనేజర్‌గా నియమించారు.



రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న జేడీ రమేష్ నాయక్

ఏటా శునకాలకు రేబిస్ టీకాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రేబిస్.. జంతువు నుంచి ఇతర జంతువులు, మనుషులకు సంక్రమించే వ్యాధులో ఒకటని పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ కె. రమేష్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డు బహుళార్థ పశువైద్యశాలలో శునకాలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాల కులు డాక్టర్ జి. వైతన్య కిషోర్, బహుళార్థ పశు వైద్యశాలలో సహాయ సంచాలకులు ఎం. మాలకొండయ్య, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఉషాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ● నగరం లోని రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయంలో ప్రపంచ రేబిస్ డే నిర్వహించారు.

బాబోయ్.. ఏం కొనలేం.. తినలేం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు

పండగ వేళ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. దీపావళికి దీపం వెలిగించే నువ్వుల నూనె నుంచి వంట నూనెల ధరలు కంపెనీలబట్టి కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి. కొట్టడి రూపాయిల హోల్ సేల్ వ్యాపారం జరిగే నెల్లూరు స్టోన్‌హౌస్ పేట ప్రాంతంలో ధరల్లో వ్యత్యాసం కనిపి స్తోంది. గత నెలలో కిలో తెల్లగడ్డలు రూ. 300 ఉంటే ప్రస్తుతం రూ.350కి పెరిగాయి. చిల్లర దుకాణాల్లో కిలో రూ.400 వంతున అమ్ముతున్నారు. వివిధ రకాల పప్పుల మీద కిలోకి రూ.20 నుంచి రూ.40 వరకు ధరలు పెరిగిపోయాయి.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి: ఉల్లి ధరలు సామాన్యు డిని కన్నీరు పెట్టిస్తున్నాయి. రెండు మాసాల క్రితం వందకు నాలుగు కిలోల ఎర్రగడ్డలు ఇచ్చే వారు. ప్రస్తుతం కిలో రూ.50కి చేరింది. ఇందులో కూడా తడి.. పొడి పేరుతో ధరలు మార్చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి దిగుమతి తగ్గిపోయిందని, రవాణా ఛార్జీలు పెరిగి పోతు న్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



టమాటా ధరలకు రెక్కలు: టమాటా ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. వందకు ఆయిదు కేజీలు అమ్మేవారు. కేవలం రోజుల్లోనే ధరలు పెరిగి పోయాయి. ఏసీ మార్కెట్‌లో కిలో రూ.40, మరో రకం రూ.50 వంతున అమ్ముతున్నారు.



పేదోళ్ల పరిస్థితి ఎలా.. : రమణమ్మ



నిత్యావసరాల ధరలు పెరి గిపోతుంటే పేదోళ్లు ఎలా బత కాలి. హోల్‌సేల్‌గానే ధరలు పెరిగాయి. ఇక వీధుల్లో ఉండే దుకాణ యజమానులు ధరలు భారీగా పెంచి అమ్ముతున్నారు.

ప్రభుత్వాలు పట్టించుకోవాలి : అలీ



ధరలు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సగటు జీవి అటు నిత్యావసరాలు.. ఇటు కూరగా యలు కొనలేక పోతున్నారు. ధరలు నియంత్రించాలి.

రాయితీపై ఇవ్వాలి : వెంకట రమణమ్మ



ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు, నూనె ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వాలు చొరవ చూపి ధరలు తగ్గించ డానికి చర్యలు తీసుకోవాలి. రైతుబజార్లలో రాయితీపై ఇవ్వాలి.

గుర్రం జాషువాకు ఘన నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో గుర్రం జాషువ ప్రజా గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గుర్రం జాషువ జయంతిని నిర్వహించారు. కార్యక్ర మంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాసిం, కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య, సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం జాషువ సాహిత్య పోటీల్లో విజేతలు బహుమతులు అందజేశారు. ● నెల్లూరు(విద్య): డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో జాషువ జయంతి నిర్వహించారు. ప్రిన్సి పల్ డాక్టర్ డి.గిరి, కోఫురు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు శ్యామలరావు, తెలుగు శాఖ అధ్యక్షుడు కె.కరుణశ్రీ, అధ్యాపకులు సత్యనారా యణ, సుభాషిణి, దివ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు. ● నెల్లూరు(విద్య): నగరంలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పులి వెంకయ్య, ఎన్ఎస్ఐ అధికారి మునిరాజా, అధ్యాపకులు సుధీర్, కె.శ్రీనివాసులు, సంజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి

నెల్లూరు (విద్య), : భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, కార్యదర్శి రమణ, జగదీష్, కళ్యాణ్, చరణ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు(ఏసీ నగర్): స్థానిక తురిమెల నాగిరెడ్డి పాఠశాలలో విద్యార్థులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు పి.కొండమ్మ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌తోనే రాష్ట్రం సుభిక్షం

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌తోనే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారని జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లి కార్జున యాదవ్ అన్నారు. పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభా వంగా శనివారం ఆయన నగ రంలో వినాయక హోమం నిర్వహించారు. జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయ్‌కుమార్ సూచనల మేరకు ఈ హోమాన్ని చేపట్టినట్లు తెలి పారు. సుందరం రామిరెడ్డి, గునుకుల కిషోర్, సుజయ్ బాబు, జమీర్, కట్టె వెంకటే శ్వర్లు, పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గృహాలు అందించేందుకు చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ) : రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థ ఆధ్వ ర్యంలో నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. శనివారం వెంకటేశ్వరపురం లేఅవుట్‌లో లబ్ధి దారులతో ఆవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెప్మా ద్వారా రుణాలను సులభతరంగా అందుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధి దారులు తమ గృహాలను నిర్మించుకోవడంలో ఉన్న ఇబ్బందులను గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మధుసూదన్ రావు, ఇన్‌ఛార్జి డీఈఈ మనో జ్‌కుమార్, మెప్మా సీఎంఎం వెంకయ్య పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు మూలాపేట లోని పోలీసు క్వార్టర్స్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం పరిశీ లించారు. స్థానికులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీలు సిహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

నారాయణలో జాతీయస్థాయి నృత్య ప్రదర్శన

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళా శాలలో శనివారం జాతీయస్థాయి నృత్య ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి నులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ముఖ్యఅతిథి దేవార్ట్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ మంజుభార్గవి, సిజిఎస్‌టీ అసిస్టెంట్ కమిష నర్ ఉపాకిరణ్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, అసి స్టెంట్ ప్రొఫెసర్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

తొలగించారు.. తరలించడం మరిచారు

నెల్లూరు నగరంలోని శ్రీనివాసహాలు వెనుక అపార్ట్‌మెంటు, షాపింగ్‌మాల్ మధ్యలోని పంట కాలువలో పూడిక తీశారు. చెత్తాచెదారం కుప్పలు దిబ్బలుగా పోసి వది లేశారు. అవి దుర్గంధం రావడంతో పాటు మళ్లీ కాలువ లోకి చేరుతున్నాయి. అధికారులు స్పందించి పూడిక వ్యర్థాలను తొలగించాలని స్థాని కులు కోరుతున్నారు. పూడిక వ్యర్థాలను తొలగిస్తామని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



– న్యూస్‌టుడే,నెల్లూరు(టౌన్)

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

ఫత్తేఖాన్‌పేట రైతుబజారు పక్క వీధిలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. రోడ్డంతా పరచుకో వడంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో 'ముక్కుమూ సుకోవాల్సిందే' శీర్షికన గురువారం చిత్ర కథనం ప్రచురిత మైంది. స్పందించిన అధికారులు వ్యర్థాలను తొలగిం చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



ఖాళీ స్థలాల్లో ఆయిల్ బాల్స్

నగరంలోని ఇళ్ల మధ్యఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరి కుంటలుగా మారడంతో దోమలు విజృంభిస్తున్నాయి. నగరపాలకసంస్థ అధికా రులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో స్థానికులు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. సమస్యపై సోమ వారం 'ఈనాడు'లో 'వ్యాధుల ముప్పు' శీర్షికన కథనం ప్రచు రితమైంది. స్పందించిన నగరపాలకసంస్థ అధికారులు ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



సామూహిక సీమంతం



నగరంలోని వెంకటేశ్వరపురం సెక్టార్ పరిధిలోని జనార్దన్ రెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవం జరిగింది. సెక్టార్ సూపర్‌వైజర్ కె.లక్ష్మీ రాజ్యం ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిగాయి. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని 30 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం)

అరుదైన వ్యాధికి శస్త్రచికిత్స

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: అరుదైన వ్యాధికి అధునాతన పద్ధతిలో చికిత్స నిర్వహించి నట్లు నెల్లూరు రూరల్ నారాయణ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. హాస్పిటల్‌లో శనివారం జరి గిన సమావేశంలో బాధితుడు నెల్లూరుకు చెందిన ప్రసాద్(37) మాట్లాడుతూ.. తనకు కొన్నేళ్లుగా ఎడమ ముక్కు నుంచి నీరు కారడం, గాలి సరిగా రాకపోవడం వంటి సమస్యలతో ఏళ్లుగా ఇబ్బంది పడినట్లు తెలిపారు. జలుబు చేసిన ప్రతిసారి చలి, వణుకు, జ్వరం, ఒళ్లునొప్పులు వచ్చేవని తెలి పారు. హాస్పిటల్ వైద్యులు నయం చేశారని తెలి పారు. డాక్టర్ జి.రమేష్‌బాబు మాట్లాడుతూ.. పుట్టుకతో లోపం వల్ల లేదంటే దీర్ఘకాలం మెదడు ఒత్తిడికి గురికావడం వల్ల ఇన్ఫెక్షన్ సోకిందన్నారు. ముక్కు నుంచి ఎండోస్కోపిక్ పద్ధతిలో న్యూరో సర్జరీ వైద్య నిపుణులు పర్యవేక్షణలో శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు(విద్య): నగరంలోని వీఆర్సీ పీవర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఏసీ కూరగాయల మార్కెట్, వీఆర్సీ సెంటర్, చాకలివీధి, ఆచారివీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఆ శాఖ అధికా రులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంత రాయం ఉంటుందని వినియోగదారులు ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

మహా దీపోత్సవం నిర్వహణపై చర్చ

నెల్లూరు(సాంస్కృతికం): సింహపురి కార్తిక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నవంబర్ 15న మూలాపేటలోని గణేష్ ఘాట్‌వద్ద మహా కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల తెలి పారు. రామ్మూర్తినగర్‌లోని ఎన్‌ఆర్ పంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మహా దీపోత్సవాన్ని నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

పైపులైన్‌తో రైతులకు నష్టం

నెల్లూరు(కలెక్టరేట్): కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాదుకు ఏర్పాటు చేస్తున్న పైపు లైన్లతో రైతులకు అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య, ఉపాధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొ న్నారు. నగరంలోని పల్లిపాడు రైతు, కౌలుదారు జేఏ వ్యవసాయ కార్మిక, రైతు, కౌలుదారు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌కు వినతిపత్రం అందించారు.

పోలీసుల అదుపులో కిలేడీ

నెల్లూరు(నేర విభాగం) : మూలాపేటకు చెందిన కుసుమబాబు కొన్నేళ్ల క్రితం వేణుగోపాలస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులపై దౌర్జన్యం చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.9,24,500 విలు వజేసే బంగారు ఆభరణాలు, నగదును దోచు కుంది. పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటికే ఆమెపై పలు కేసులు పెండింగ్‌లో ఉండటంతో పోలీసులు

సంక్షిప్త సమాచారం

సస్పెక్ట్ షీటు తెరిచారు. దీంతో ఆమె తన అడ్రస్, పేరు మార్చుకుని నాలుగేళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా పోలీసుల కళ్లుగప్పి తిరుగు తోంది. కోర్టు ఆమెకు అరెస్టు వారెంటు జారీ చేసింది. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వ రావు సిబ్బందితో ఆమె కోసం గాలింపు చేప ట్టారు. స్టోన్‌హౌస్‌పేట వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆమె స్టోన్‌హౌస్ పేటకు చెందిన ఓ వ్యక్తిని పెళ్లి పేరుతో మోస గించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధురాలు

నెల్లూరు: నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఓ వృద్ధురాలిని వదిలేసినట్లు సమాచారం. ప్లాట్‌ఫాంలో వృద్ధురాలి ఉన్నట్లు గుర్తించిన ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని జిల్లా ప్రభుత్వాస్ప త్రికి తరలించారు. దీనిపై పోలీసులుకూని, అది కారులుకూని ఎలాంటి సమాచారం లేదు. కుటుంబ సభ్యులే ఆమెను వదిలేశారా? మరే దైనా కారణాలు ఉన్నాయా తెలియదు.

మూడు బైక్‌ల చోరీ

నెల్లూరు(నేర విభాగం): స్టోన్‌హౌస్‌పేటకు చెందిన ఎం.సురేష్‌కుమార్‌కు చెందిన వాహనం, చిదవలూరు మండలం ముదివర్తిపా లెంకు చెందిన ఆరుణకు చెందిన వాహనం ఆగ తేడాది నవంబరు 18న, తోటపల్లి గూడూరు మండలం గుమ్మళ్లపాలెం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు చెందిన బైక్ గతేడాది డిసెంబరు 6న నెల్లూరులో మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకాపా నాయకుల పూజలు

నెల్లూరు(నగరపాలకసంస్థ): కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూ తయారు చేశారంటూ చంద్ర బాబు అసత్య ప్రచారంతో హిందువుల మనోభా వాలు దెబ్బతిన్నాయని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని శ్రీవెంకటేశ్వ రస్వామి ఆలయంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభా కర్‌రెడ్డితో కలిసి ప్రాయశ్చిత్త పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగా రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నేలసారానికి నానో ఎరువులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నేలసారానికి, పర్యావరణానికి నానో ఎరువులు అనుకూలమని ఇఫ్కో శాస్త్రవేత్త డాక్టర్ తరుణ్ ఇంద సింగ్ తెలి పారు. నానో ద్రవరూప ఎరువులపై అవగాహన సదస్సు నగరంలోని ముత్తుకూరు రోడ్డు వ్యవ సాయ పరిశోధన స్థానంలో శనివారం జరిగింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(విద్య) : ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని ఆ శాఖ ఎస్ఈ వి.విజయన్ పేర్కొన్నారు.

వంతెన పనులు వేగవంతం

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ నియోజక వర్గ పరిధిలో రూ.75కోట్లతో బుజబుజనెల్లూరు, కనుపర్తిపాడు కూడలి వద్ద ఫ్లైఓవర్ పనులు సర్వీస్ రోడ్ల పను లను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ.. గత ప్రభుత్వంలో పనులు మంజూరైనా తాను అధికార పార్టీ నుంచి దూరం అయ్యాక నిధులు విడుదలవకుండా సాగదీశారన్నారు. ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంకే.చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మెడికవర్‌లో ప్రపంచ గుండె దినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి ఆధ్వర్యంలో శని వారం ప్రపంచ గుండె దినోత్సవం జరి గింది. యోగా పర్ హెల్తీ హార్ట్ అనే థీమ్‌తో యోగా మాస్టర్ డాక్టర్ స్వప్న పర్య వేక్షణలో వైద్య సిబ్బంది పలు ఆసనాలు వేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి, సర్కిల్ హెడ్ శైలజ, మార్కెటింగ్ హెడ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య: శివగిరికాలనీ ఏడో వీధిలో స్తంభాలకు విద్యుద్దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నారు. – వాసు

? నవాబుపేట ఎస్‌బీఐ కాలనీ సుదర్శనపు తూర్పు వైపు ఆర్టీఓడ్డు చివర ఎస్‌బీఎ 4/పీ4-2 విద్యుత్తు స్తంభానికి వీధి దీపం పగిలిరోజు లుగా వెలగడం లేదు. – లక్ష్మీనరసయ్య

సమాధానం: విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తాం. – సూర్యతేజ, కమిషనర్

? అంబేడ్కర్‌నగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు ముందుకు కదలడం లేదు. – సాంబశివ

? నగరంలోని ట్రంకురోడ్డు ఏటీ అగ్రహారం బాబు విస్తరణ పక్క వీధిలో కాలువల వెంబడి తవ్వుతూ ఉన్నాయి. పూడిక పేరుకుపోయి మురుగు రోడ్డుపైకి చేరుతోంది. – బాబూసింగ్

✓ కాలువల్లో పూడికలు తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ, నవాబుపేట)

కార్పొరేషన్‌లో పలువురు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(నగరపాల కసంస్థ): నెల్లూరు నగ రపాలకసంస్థ ఇంజినీ రింగ్ విభాగంలో డీఈ లుగా బీవీ రమణ రామ్, రామ్మోహన్ రావు, ఈఈగా షేక్ రహంతుల్లాలి, పట్టణ ప్రణాళిక విభాగం సర్వే యర్‌గా కామేశ్వరరావు బాధ్యతలు స్వీకరిం చారు. శనివారం క్యాంపు కార్యాలయంలో కమిషనర్ సూర్యతే జను కలిసి మొక్కలు అందజేశారు.

పేదలంటే చిన్నచూపే!

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

పేదల నివాస ప్రాంతాలపై అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ఫలితంగా కనీస వస తులు కరవై అవస్థలు పడుతున్నారు. నెల్లూరు- జొన్నవాడ రోడ్డులోని ఇరుగాళమ్మ సంఘంలో సమస్యలు తిష్ట వేశాయి. రోడ్డు అంచున నెల్లూరు చెరువు కట్టపై సుమారు వందకు పైగా కుటుంబాలు నివాసం ఉంటు న్నాయి. చినుకు పడితే ఈ ప్రాంతం అధ్వా నంగా తయారవుతోంది. కాలువ పూడికతో నిండి పోవడంతో చినుకు పడితే నిరంతా రోడ్డుపై చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. కూళాయిలు కాలువలోనే ఉండ టంతో మురుగునీటిలోనే తాగునీరు పట్టుకో వాల్సి వస్తోంది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు వ్యాప్తి కారణంగా



ఇరుగాళమ్మ సంఘం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతు న్నారు. ఇరుగాళమ్మ సంఘం నుంచి ఇసుక వరకు వెళ్లే ఒకవైపు ఒకవైపు అసలు రోడ్డు లేదు. ఇక్కడి పారిశుద్ధ్య పనులు జరగకపోవడంతో రోడ్డపై చెత్త ఇరుగాళమ్మ సంఘంలో వెళ్లి పూడికను తీయడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థాని

ఇరుగాళమ్మ సంఘంలో సమస్యల తిష్ట

కులు కోరుతున్నారు.

నీటిలో ఆర్ఆండ్‌బీ రోడ్డు : సంఘం వెంబడి ఉన్న నెల్లూరు- జొన్నవాడ రోడ్డును మూడేళ్ల క్రితం రూ.6కోట్లతో నిర్మించారు. గుత్తేదారుడు నిబంధనల పాటించలేదు. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రోడ్డును ఇష్టానుసారంగా నిర్మించారు. దీంతో ఎక్కువడటంతో అక్కడ గుంతలు పడ్డాయి. మరో వైపు వర్షం పడితే నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. ఆ ప్రాంతం మీదుగా జొన్నవాడ, నరసిం హకొండ పుణ్యక్షేత్రాలతోపాటు పల్లెలకు రాక పోకలు సాగించే వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ● సంఘంలో సమస్య లపై కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ కాలు వల్లో పూడిక తీయిస్తామని తెలిపారు.